

ఎస్ఆర్‌నగర్‌లో డ్రైవింగ్ చేస్తున్న మైనర్‌ను అదుపులోకి తీసుకున్న సీఐ

మైనర్లు నడిపే వాహనాలను సీజ్ చేస్తాం

● ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు

అమీర్‌పేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడం, మైనర్లు వాహనాలను నడపడం వల్లే చాలావరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు వెల్లడించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారులు తాత్కాలిక ఆనందం కోసం వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారని, ఎదుటివారి జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నారన్నారు. సోమవారం నుంచి ప్రత్యేక తనిఖీల ద్వారా మైనర్లు నడిపే వాహనాలను గుర్తించి సీజ్ చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులు, వాహన యజమానులపైనా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



నీలిమను కలిసిన రాంగోపాల్‌పేట కార్యకర్తలు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: కోట నీలిమ

బేగంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన పలువురు మహిళా కార్యకర్తలు అమీర్‌పేటలోని ఆమె కార్యాలయంలో కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను మహిళలకు అందేలా కృషి చేస్తానన్నారు. అర్హులకు పథకాలు అందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జయశీలం, రేష్మా, సరిత, జ్యోతి, నిర్మల, శశికళ తదితరులు పాల్గొన్నారు.

12న హరిహర క్షేత్రంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు

బోరబండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బోరబండ స్వరాజ్యనగర్‌లోని హరిహర క్షేత్రంలో ఈ నెల 12న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కల్వల సత్యనారాయణరావు తెలిపారు. శనివారం తెల్లవారుజామున 5.45 గంటలకు సుప్రభాతం, ఉదయం 7 గంటలకు అభిషేకం, ఆకుపూజ, అర్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆయన వెల్లడించారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పంజాగుట్ట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం పంజాగుట్టలోని ఓ మాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. మాల్‌కు వచ్చిన వారిలో పలువురికి రక్తపోటు, ర్యాండమ్ బ్లడ్ షుగర్, హిమోగ్లోబిన్, కంటి పరీక్షలు, ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్లు డాక్టర్ సమీర, డాక్టర్ లావణ్య తదితరులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఈఓ డాక్టర్ దేవానంద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ రోజుల్లో వయసుతో సంబంధం లేకుండానే చాలామందికి అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ కనీసం ఏడాదికోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

పిల్లర్లకే పరిమితం

- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సామాజిక భవన నిర్మాణాలు
- ఇబ్బందులు పడుతున్న బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్ల ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బోరబండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్ల పరిధిలో చేపట్టిన సామాజిక భవనాల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పలుచోట్ల అసంపూర్తిగా మిగిలిపోయిన సామాజిక భవనాల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బోరబండ భరత్‌నగర్ బస్తీలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన సామాజిక భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని నేలమట్టం చేసి కొత్త భవన నిర్మాణ పనులు చేపట్టారు. రూ.65.35 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన భవన నిర్మాణ పనులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అప్పటి జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి ఆరేళ్ల క్రితం ప్రారంభించారు. భవనాన్ని కూల్చకముందు అందులో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగేది. బాలజ్యోతి పేరిట ప్రత్యేక ప్రాథమిక పాఠశాలను సైతం ఈ భవనంలో నడిపారు. అయితే జీ ప్లస్ వన్ పద్ధతిలో కొత్త కమ్యూనిటీహాల్ నిర్మిస్తే వివిధ కార్యక్రమాల నిర్వహణకు అనువుగా ఉంటుందని బస్తీవాసులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఆశించారు. అయితే పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పిల్లర్ల దశనే దాటలేదు.

ప్రభుత్వ పాఠశాలనే మూసేశారు..

భారత్ నగర్ బస్తీకి పక్కనే ఉన్న మధురానగర్‌లో చేపట్టిన సామాజిక భవన నిర్మాణ పరిస్థితి సైతం ఇలాగే ఉంది. ఐదేళ్ల క్రితం ప్రజాప్రతినిధులు ఈ పనులను ప్రారంభించారు. రూ.92.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో రెండు అంతస్తులకు పైకప్పు నిర్మించారు. గోడలు, ఇతర పనులు నిలిచిపోయాయి. గతంలో వినాయకరావు నగర్ సామాజిక భవనాన్ని కూల్చడంతో అక్కడ నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను ఈ భవనంలోనే నిర్వహించేవారు.



పిల్లర్లకే పరిమితమైన భరత్‌నగర్ సామాజిక భవన నిర్మాణం

కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఏళ్ల తరబడి పూర్తికాకపోవడంతో మధురానగర్‌లోని ప్రభుత్వ పాఠశాల మూతపడటమే కాకుండా అక్కడ నిర్వహించిన వినాయకరావునగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బంజారా నగర్ సామాజిక భవనంలో కొనసాగిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో కొందరు పోకిరీలు రాత్రి వేళల్లో మద్యం, గంజాయి తాగడంతో పాటు ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా మిగిలిన మధురానగర్ కమ్యూనిటీ హాల్



పెద్దమ్మనగర్‌లో..

పెద్దమ్మనగర్‌లోనూ అదే పరిస్థితి

బోరబండ బలహీనవర్గాల కాలనీ పెద్దమ్మనగర్‌లో చేపట్టిన సామాజిక భవన నిర్మాణ పనులు గత ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నాయి. వివిధ కారణాలతో నిర్మాణపనుల్లో తీవ్రజాప్యం జరుగుతోంది. రూ.5.38 లక్షల అంచనా వ్యయంతో జీ+1 పద్ధతిలో చేపట్టిన నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయని బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయని సామాజిక భవనంలో కాస్త చీకటి పడగానే మద్యం, గంజాయి తాగే వారికి అడ్డాగా మారుతోందని చెబుతున్నారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే బస్తీవాసుల సమావేశాలు, అంగన్‌వాడీ కేంద్రం, గ్రంథాలయం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని.. త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్పీఆర్ హిల్స్‌లో..

ఎస్పీఆర్ హిల్స్ నవీన్‌నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పదేళ్లుగా పెండింగ్ లో ఉంది. బండపల్లి చంద్రమ్మ కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో పనులు మొదలైనప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. ప్రజలకు అందుబాటులోకి రాకపోగా కొంతమంది ఆక్రమించుకొని ఇందులో ఉంటున్నారని బస్తీవాసులు తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్‌లోని పలు బస్తీల్లో ఉన్న సామాజిక భవనాలకు చాలాకాలంగా మరమ్మతులు చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న భవనాల నిర్మాణం పూర్తిచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయండి

- కార్యకర్తలకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పిలుపు



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి

బంజారాహిల్స్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్టీ కార్యకర్తలను కోరారు. సభకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో 25ఏళ్ల క్రితం ఏర్పాటైన బీఆర్ఎస్ అనేక విజయాలు సాధించిందన్నారు. అసాధ్యం అనుకున్న తెలంగాణను సాధించామని.. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో విసిగిపోయారని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు మితిమీరిపోయాయని ఆరోపించారు. భూకబ్జాలు, బెదిరింపులకు పాల్పడుతూ సామాన్యులను ఇబ్బందులు పెడుతున్నారన్నారని మండిపడ్డారు. నియోజకవర్గం నుంచి 3 వేల మంది కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేశామని.. పెద్ద సంఖ్యలో తరలివచ్చి వరంగల్ సభకు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు, సీనియర్ నేతలు షరీఫ్, జావేద్, విజయ్ కుమార్, అజయ, శ్యామ్ రావు, రామకృష్ణ, నర్సింగ్ రావు, అప్పు ఖాన్, అరుణ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో అవకతవకలపై విచారణ జరపాలి

- గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శరత్ నాయక్

పంజాగుట్ట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ హైదరాబాద్ పరీక్షల విభాగంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ గిరిజన శక్తి అధ్యక్షుడు శరత్ నాయక్, లంబాడీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం జూన్‌లో జేఎన్టీయూ హైదరాబాద్‌లో చదువుతున్న ఐదుగురు విద్యార్థుల మార్కులను మార్చారన్నారు. అప్పుడు ఇన్‌చార్జి వీసీగా ఉన్న బాలకృష్ణారెడ్డి దీనిపై స్పందించారని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్‌ను తొలగించారన్నారు. అయితే అప్పుడు నియమించిన కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినర్‌గా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఉన్నారని, ఎస్టీ ప్రొఫెసర్‌కు జరిగిన అన్యాయంపై ఇప్పటికే సీఎం సలహాదారు వేంనరేందర్ దృష్టికి తీసుకెళ్లామని, జాతీయ ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన శక్తి కార్యనిర్వాహక అధ్యక్షుడు సుబెందర్ నాయక్, సమన్వయకర్త రమేష్ రాథోడ్, విజేందర్ పవార్, వినోద్, సతీష్, చందర్ తదితరులు పాల్గొన్నారు.



అష్టావధానం నిర్వహిస్తున్న యువ కవి సుసర్ల సుధన్య తదితరులు

ఐఐఎంసీలో అష్టావధానం

ఖైరతాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు కార్యక్రమాల్లో భాగంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ)లో యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ఐఐఎంసీ కళాశాల, సాధన సాహితీ స్రవంతిల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం సభికులను ఆకట్టుకుంది. సాహితీమూర్తుల సమావేశంలో ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ చూడామణి 'రామాయణ కృతులు- సాహితీ ఔరభాలు' అనే అంశంపై మాట్లాడారు. పలువురు కవులు రచించిన రామాయణంలో ఉన్న విశిష్టతను, సాహిత్య అంశాలను వివరించారు. రామాయణం ద్వారా నేర్చుకోవాల్సిన ధర్మ సూక్ష్మాలపై వివరణ ఇచ్చారు. సాధన సాహితీ స్రవంతి సంస్థ అధ్యక్షుడు సాధన నరసింహాచార్య మాట్లాడుతూ.. తెలుగు సాహితీ ప్రక్రియకే మకుటాయమానంగా జరుగుతున్న తెలుగు వెలుగు కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఫణీంద్ర, ఎం.దత్తాత్రేయ శర్మ, సి.రామకృష్ణారావు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు




ఖైరతాబాద్ జోన్ సర్కిల్ 18 నూతన డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సమ్మయ్యను కలిసి శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్, ఖైరతాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, టీడీపీ నాయకుడు బాలాజీ గోస్వామి తదితరులు

- బంజారాహిల్స్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి)

సిఫారసులతోనే పోస్టింగ్!

- లేదంటే ఖాళీగానే పోస్టులు
- దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తీరుపై విమర్శలు
- ఖాళీగానే కీలక పోస్టులు.. పైరవీలతోనే పని
- పనితీరు ఆధారంగా పోస్టింగ్ ఇవ్వకపోవడంపై సీనియర్ల అసంతృప్తి



దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో ప్రభుత్వ పెద్దల సిఫారసు లేఖలుంటే పోస్టింగ్ ఇస్తున్నారని, లేదంటే ఆ పోస్టులు ఖాళీగా ఉంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దక్షిణ డిస్కంలో మార్చి 31న ఇద్దరు ఎస్ఈ (సూపరింటెండింగ్ ఇంజనీర్)లు పదవీ విరమణ చేశారు. ఆ పోస్టుల్లో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. గత నెలలో ఓ సర్కిల్‌లో డీఈ విరమణ పొందిన మూడు వారాల తర్వాత ఇతర జిల్లాలో పనిచేస్తున్న ఓ అధికారి మంత్రి సిఫార్స్‌తో ఆ పోస్టింగ్ తెచ్చుకున్నారనే ఆరోపణలున్నాయి. పోస్టులు ఖాళీ అయిన ఒకటి రెండు రోజుల్లో పోస్టింగులివ్వకుండా ఇతర వింగ్‌లో పని చేసే అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ నెట్టుకొస్తున్నారు. గ్రేటర్‌పై అవగాహన లేని అధికారులకు ఇక్కడి సర్కిళ్లలో పోస్టింగులు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. హబ్సిగూడ సర్కిల్ ఎస్ఈ, దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయం కమర్షియల్ వింగ్‌లో ఎస్ఈ పోస్టు ఖాళీ అయ్యి వారం రోజులు పూర్తయినా ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. ఈ పోస్టులకు సిఫార్స్ లేఖ ఎవరు తెచ్చుకుంటారోననే చర్చ విద్యుత్ ఉద్యోగుల్లో జరుగుతోంది. హబ్సిగూడ సర్కిల్‌లో ఎస్ఈ పోస్టుకు 6-8 మంది సీనియర్ ఇంజనీర్లు పోటీ పడుతుండగా, కమర్షియల్ విభాగం ఎస్ఈ పోస్టు కోసం 3-4 ఎస్ఈ స్థాయి అధికారులు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇలాంటి పరిస్థితులు లేవని.. గత కొంత కాలంగా కొంతమంది కావాలనే ఈ తరహా పరిస్థితులు కల్పిస్తున్నారని సీనియర్ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పనితీరు ఆధారంగా పోస్టింగులు ఇవ్వాలి కానీ రాజకీయ పైరవీలతో ఇవ్వడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

హెచ్ఆర్ వింగ్ పనితీరుపై విమర్శలు

దక్షిణ డిస్కం హెచ్ఆర్ వింగ్‌లో పనిచేస్తున్న అధికారుల తీరుపై సంస్థ అధికారులు, సిబ్బంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతులు, బదిలీలు చేపట్టినా ఆ వివరాలు గోప్యంగా ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బదిలీలు జరిగితే ఏ అధికారి ఏ పోస్టులో ఉన్నారో తెలుసుకోవడం కష్టంగా మారుతుందని కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు. ఈఎల్ శాంక్షన్లు, ఇంక్రిమెంట్లు, లీవ్ శాంక్షన్లు ఇలా ఏ పనికోసమైనా హెచ్ఆర్ వింగ్ చుట్టూ తిరిగితే తప్ప కావడం లేదని కొంతమంది కార్మికులు ఆరోపిస్తున్నారు. సమాచారం కోసం హెచ్ఆర్ వింగ్‌కు ఫోన్లు చేసినా అధికారులు, సిబ్బంది సరిగా స్పందించకపోవడంతో జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వివరాలు తెలుసుకునేందుకు కార్పొరేట్ కార్యాలయానికి రావాల్సి వస్తోందని కార్మికులు చెబుతున్నారు. ఉద్యోగుల ఫైళ్లు నెలల కొద్దీ పక్కన పెడుతుండటంతో హెచ్ఆర్ విభాగం చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోరబండ బస్టాప్‌లో టాయిలెట్లు నిర్మించాలి

బోరబండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బోరబండ బస్టాపులో మూత్రశాలలు అందుబాటులో లేకపోవడంతో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. బోరబండ నుంచి నిత్యం వందల ట్రిప్పులతో వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే టాయిలెట్లు అందుబాటులో లేకపోవడంతో బహిరంగ ప్రదేశాల్లోనే మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. మధ్యలో బస్సులు ఆపడం వల్ల తమకు ఆలస్యమవుతుందని ప్రయాణికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బోరబండ బస్టాప్‌లో మూత్రశాలలు నిర్మించాలని ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు కోరుతున్నారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

● గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

బోరబండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీక్ అయిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ బ్రహ్మశంకర్ నగర్‌కు చెందిన బి.అశోక్ గత నెల 31న వంట చేస్తుండగా గ్యాస్ లీక్ అయి మంటలు అంటుకొని శరీరం, ముఖం కాలిపోయాయి. అతని సోదరుడు వెంకట్ ఈ విషయాన్ని అశోక్ భార్య అనురాధకు చెప్పాడు. మెదక్ జిల్లా మహమ్మద్ పురలోని అత్తవారింట్లో ఉన్న ఆమె గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భర్త అశోక్‌ను చూసేందుకు వచ్చింది. పోలీసులు, కోర్టు సిబ్బందికి గ్యాస్ లీక్ అయి మంటలు అంటుకొని గాయాలైనట్లు అశోక్ తెలిపాడని ఆమె పోలీసులకు చెప్పింది. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అశోక్ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు అనురాధ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసిన మధురానగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్లీ బర్డ్‌ను వినియోగించుకోండి

ఖైరతాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నెల పూర్తయ్యేలోపు 5 శాతం మినహాయింపుతో ఆస్తిపన్ను చెల్లించాలని జంట సర్కిళ్ల ఉపకమిషనర్లు కోరారు. సర్కిల్ 17లో ఇప్పటి వరకు ఈ నెలలో 5 కోట్ల రూపాయలు వసూలయ్యాయని ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. సర్కిల్ 18లో ఇప్పటి వరకు రూ.8.6 కోట్లు వసూలు చేశామని ఉప కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

అనాథలకు చేయూత అందిస్తున్నాం

బేగంపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అనాథలకు చేయూత అందించేందుకు కృషి చేస్తున్నామని సనత్‌నగర్ జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.గంగాధర్‌రావు, వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం జెక్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనాథాశ్రమాల్లో ఉండే వారికి అవసరమైన వస్తువులను అందజేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాలలో ఫర్నిచర్ అందజేశామన్నారు. ఈ సంవత్సరం సంగారెడ్డి జిల్లాలోని దినెస్ట్ వృద్ధాశ్రమానికి సుమారు రూ.50వేల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు యార్లగడ్డ వేణుగోపాల్ రావు, ఎంఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు



సీతాఫల్‌మండిలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలో పాల్గొన్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు సుంకు రామచందర్



బీఆర్‌ఎస్ యువ నాయకుడు పొగర్తి భువనరావు ఆధ్వర్యంలో పాటల సీడీని ఆవిష్కరిస్తున్న యువనేత తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్

బౌద్ధనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్‌లో బీఆర్‌ఎస్ యువ నాయకుడు పొగర్తి భువనరావు ప్రత్యేకంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌పై రాయించిన పాటల సీడీని బీఆర్‌ఎస్ యువనేత తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సీతాఫల్‌మండిలో జరిగిన వేడుకల్లో బీఆర్‌ఎస్ యువనాయకుడు సుంకు రామచందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. పాకసాయి, రబ్బానీ, రాజు తదితరులు పాల్గొన్నారు. బౌద్ధనగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్‌లో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కార్పొరేటర్ కంది శైలజ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, నాయకులు బెజ్జంకి రాజేష్, తదితరులు పాల్గొన్నారు. బ్రాహ్మణబస్తీలో వృద్ధుల ఆశ్రమంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, నాయకుడు కరాటే రాజు తదితరులు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. వారాసిగూడ చౌరస్తాలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు బోల్ల సుమిత్‌యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. సీతాఫల్‌మండి ఎస్సీఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్, కల్వ సుజాత తదితరులు

మారేడుపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బీజేపీ దేశ వ్యాప్తంగా అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ పాదయాత్రను ఎమ్మెల్యే శ్రీగణేష్ నాయకత్వంలో సోమవారం కంటోన్మెంట్ 4వ వార్డులోని గాంధీ కాలనీ గాంధీ విగ్రహం నుంచి పికెట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. బీజేపీ మత రాజకీయాలతో దేశాన్ని ముక్కలు చేస్తోందని, నినాదాలతో ప్రజలను మభ్యపెడుతూ బ్లాక్ మెయిల్ చేస్తోందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం రాజ్యాంగాన్ని, రాజ్యాంగ రచయితను అవమానపరుస్తోందని బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ దళిత, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచడమే ఈ పాదయాత్ర ఉద్దేశమన్నారు. పాదయాత్రలో జైబాపు.. జై భీమ్.. జై సంవిధాన్ అభియాన్ కంటోన్మెంట్ కో ఆర్డినేటర్ వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీరామ్ ఆనంద్, మధుకర్, మల్లేష్, సత్యనారాయణ, సి.సంతోష యాదవ్, నాగేష్, సి.వైష్ణవి, సాంసంగ్ రాజ్, బల్వంత్ రెడ్డి, వెంకటేష్, సురేఖ, రాజేందర్, ప్రజలు పాల్గొన్నారు.

జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలి



సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

బౌద్ధనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పలు ఉద్యమాలు, పోరాటాలు చేసిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించాలని పలువురు జర్నలిస్టులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 13న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తలపెట్టనున్న జర్నలిస్టుల సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యంగౌడ్ ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌బైరాగి, టీయూజేఏసీ కార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డి, చర్ల చంద్రన్న ప్రసాద్, హైదరాబాద్ జర్నలిస్ట్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఉలుసు బ్రహ్మానందం, సీనియర్ జర్నలిస్టులు చీకోటి శ్రీనివాస్, భాస్కర్, కొండేటి శ్రీనివాస్, మహేందర్, మున్నూరు చందు, కల్పన, కే.రాజేంద్రప్రసాద్, యశ్వంత్(నాని), మద్దెర్ల కిరణ్, గిరిగౌడ్, మాణిక్యం, శ్రీనివాస్‌గౌడ్, ఉద్యమ కళాకారుల వేదిక అధ్యక్షుడు డోలక్ యాదగిరి, సాయి పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల కల్యాణ మహోత్సవం



స్వామి వారి ఊరేగింపునకు ప్రత్యేక పూజలు చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, తదితరులు

తిరుమలగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన హనుమాన్ ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు దాతలు, భక్తుల సహకారంతో వైభవంగా జరిగాయని ఈఓ మహేందర్‌రెడ్డి తెలిపారు. స్వామివారి ఊరేగింపు రాత్రి వరకు కొనసాగిందని, వివిధ హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయని సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

సీతాఫల్‌మండిలో..



బౌద్ధనగర్: సీతాఫల్‌మండి రామాలయం వద్ద ఆదివారం రాత్రి సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ఆధ్వర్యంలో ఈ కల్యాణ వేడుకల్లో సినీహీరో కృష్ణసాయి, బీఆర్‌ఎస్ యువ నాయకుడు తలసాని సాయికిరణ్‌యాదవ్ అతిథులుగా పాల్గొన్నారు.

పార్కు నిర్వహణ ఇలాగేనా?

- అధ్వానంగా ఉద్యానవనం
- చెత్త డంపింగ్ యార్డ్‌గా పార్కులు
- అందుబాటులోకి తేవాలని కాలనీవాసుల డిమాండ్



వెంకట్రావునగర్ కాలనీలోని పార్కులో చెత్తాచెదారం

ఎండకు ప్రజలు అల్లాడిపోతున్నారు. వాణిజ్య కేంద్రంగా విరాజిల్లుతోన్న రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ఆహ్లాదాన్ని పొందుదామనుకునే స్థానికులకు చెట్లనీడ కూడా కరువవుతోంది. పార్కులో నైనా కాస్త సేద తీరుదామనుకుంటే పార్కులో పచ్చదనం లేక ఎండమావిని తలపిస్తోంది.

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని పలు పార్కుల పరిస్థితి ఏళ్ల తరబడి ఇలాగే కొనసాగుతోంది. ఇటీవల కొన్ని కాలనీల్లోని పార్కులు కాస్త మెరుగైనప్పటికీ మరికొన్ని పార్కులు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. దీంతో వేసవిలో పార్కుల్లో సేద తీరుదామంటే వారి ఆశలు అడియాసలవుతున్నాయి.



లక్ష్మీనారాయణ కాలనీ పార్కులో ఉన్న పశువులు

నిరుపయోగంగా పార్కులు

రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారయణ కాలనీ సమీపంలోని పార్కు, వెంకట్రావ్ నగర్ కాలనీ పార్కు ఇందుకు ఉదాహరణగా నిలుస్తాయి. అప్పుడప్పుడు కాస్త నామ మాత్రంగా శుభ్రం చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు మారుతున్నారు కానీ, వీటి పరిస్థితి మాత్రం మారడం లేదు. పార్కులో చెత్తాచెదారం నిండుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. మరోపక్క లక్ష్మీనారాయణ పార్కు పశువులు సేద తీరే ప్రాంతంగ మారింది. ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

పార్కును శుభ్రంగా ఉంచాలి



పార్కును ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. ప్రతి రోజూ చెత్తను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎండాకాలం వచ్చిందంటే ఎండ వేడికి తట్టుకోలేక పార్కులకు వెళ్లి సేదతీరుదామంటే పార్కులు చెత్తా చెదారంతో నిండి ఆహ్లాదాన్ని పెంచకపోగ అసహనానికి గురి చేస్తున్నాయి. క్రీడా స్థలంగా ఉపయోగించాల్సిన క్రీడా మైదానాన్ని డంపిగ్ యార్డ్‌లా ఉపయోగిస్తున్నారు. దానికి తోడు సెలవుల్లో పిల్లలు ఆడుకోవడానికి కూడా లేకుండా మైదానంలో పశువులు సేద తీరుతుంటాయి.

- సురేష్ యాదవ్, చెన్నయ్ కాంపౌండ్ నివాసి

చర్యలు తీసుకుంటాం



పార్కులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే సమస్య పరిష్కారం అయ్యేలా చూసి పార్కులను ప్రజల అందుబాటులోకి తీసుకొస్తాం.

- చీర సుచిత్ర, కార్పొరేటర్, రాంగోపాల్‌పేట్

'సమస్యలను పరిష్కరించండి'

బౌద్ధనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీవర్షంతో ఇళ్లు ముంపునకు గురయ్యాయని, రోడ్లమీద బురద నిండి ఉందని, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఎల్.నారాయణనగర్, న్యూ అశోక్‌నగర్‌కు చెందిన బస్తీవాసులు బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజకు విన్నవించారు. సోమవారం ఎల్.నారాయణనగర్, న్యూఅశోక్‌నగర్ బస్తీవాసులు బౌద్ధనగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్‌లో వార్డు కార్యాలయం వద్ద భారీగా వచ్చి తమ బస్తీలో సమస్యలు పట్టించుకోరా అంటూ కార్పొరేటర్ శైలజను నిలదీశారు. దీంతో శైలజ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, నాయకులతో కలిసి ఆ బస్తీలో పర్యటించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి నాలా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ప్రసుత్తం బస్తీలో ఉన్న బురద, మట్టి, చెత్తాచెదారంను తొలగించాలని కార్పొరేటర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ తిరుపతిరావు, ఏఈ లావణ్య, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు బెజ్జంకి రాజేష్, దప్పు మల్లికార్జున్ మాదిగ, రమేష్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభకు సేవాదళ్ బృందం



అహ్మదాబాద్ శబర్మతి ఆశ్రమం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ బృందం

అడ్డగుట్ట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఆధ్వర్యంలో ఈనెల 8, 9వ తేదీల్లో జరుగనున్న 86వ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహాసభ ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ హాజరుకానున్నారు. ఈకార్యక్రమానికి తెలంగాణ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంగీత, సికింద్రాబాద్ ఇన్‌చార్జి రాంలీల, సేవాదళ్ మహిళలు సభకు వెళ్లనున్నారు. మంగళవారం సభకు అహ్మదాబాద్ సబర్మతి ఆశ్రమ నుంచి ర్యాలీగా వెళ్లనున్నారు.

రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సంతోష్‌కుమార్

సికింద్రాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునే తేదీని ఏప్రిల్ 14వ తేదీ వరకు పొడిగించినందున.. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో కోరారు. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, ఈబీసీ యువత రాజీవ్ యువ వికాసం కింద స్వయం ఉపాధి పొందేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పథకం గురించి క్షేత్రస్థాయిలో ప్రజలందరికీ వివరించాలని కోరారు.

నేడు కంటోన్మెంట్ పాలక మండలి సమావేశం

సికింద్రాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశం మంగళవారం జరుగనుంది. కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీల్లో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కోసం రూపొందించాల్సిన అంచనాలపై చర్చించి, ఆమోదించనున్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నూతన భవననిర్మాణ నిబంధనలపై చర్చించనున్నారు. చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీలో భవన నిర్మాణ నిబంధనలు సరళతరంగా ఉన్నాయని, కంటోన్మెంట్ విషయానికొస్తే... దశాబ్దాల క్రితం రూపొందించిన నిబంధనలు అమలవుతున్నాయని, అందుకే నూతన నిబంధనలు అమలులోకి తీసుకురావాలన్న డిమాండ్ సర్వత్రా ఉంది. దాంతో ఈ అంశాన్ని కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం పలుమార్లు రక్షణ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. కాగా రక్షణ శాఖ ఉన్నతాధికారులు సైతం సానుకూలంగా స్పందించి, కంటోన్మెంట్ బోర్డు నుంచి ప్రతిపాదనలు పంపామని సూచించారు. కంటోన్మెంట్ బోర్డు అధికారులు ఇప్పటికే చాలాసార్లు ప్రతిపాదనలు పంపినప్పటికీ, వాటిని పునఃపరిశీలించాలని, కొన్ని మార్పులు చేసి పంపాలని రక్షణ శాఖ అధికారులు తిరిగి టపాలో పంపుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కంటోన్మెంట్ బోర్డు అధికారులు మరోసారి నూతన ప్రతిపాదనలు సిద్ధం చేశారని, దీనికి మంగళవారం జరిగే సమావేశంలో చర్చించి, రక్షణ శాఖకు పంపాలని తీర్మానం చేయవచ్చని తెలిసింది.

అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

అడ్డగుట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ శోభ సూచించారు. సోమవారం తుకారాంగేట్ మరాఠబస్తీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇద్దరు గర్భిణులకు సీమంతం చేశారు. చిన్న పిల్లలకు బాలామృతం పౌష్టికారం అందిస్తున్నామని శోభ తెలిపారు. ఈ సీమంతం వేడుకను చూసేందుకు కేరళ విశ్వవిద్యాలయానికి చెందిన మాస్టర్ ఆఫ్ సోషల్ వర్కర్స్ (ప్రతినిధులు) వచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలో అంగన్‌వాడీ స్కూలు అందించే సేవలపై ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి భాగ్య, మండల కార్యదర్శి ప్రవీణ్ కుమార్, దయామణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కోట నీలిమను కలిసిన రాంగోపాల్‌పేట్ మహిళలు

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు సోమవారం కోట నీలిమను ఆమె కార్యాలయంలో కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన నీలిమ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చూస్తానన్నారు. మహళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నీలమను కలిసిన వారిలో జయశీల, రేష్మా, సరిత, జ్యోతి, నిర్మల, శశికళ తదితరులు ఉన్నారు.

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి



అడ్డగుట్టలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న డివిజన్ అధ్యక్షురాలు సౌందర్య

అడ్డగుట్ట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం అడ్డగుట్ట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు బీజేపీ జెండాలను ఎగురవేశారు. ఈసందర్భంగా బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వీరేశం, కృష్ణ, సాయన్న, హంసరాజు, ఉదయ్, శివాజీ, రాజు, నందు, శ్యామల, ప్రేమలత, వసంతలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి

- జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉపకమిషనర్ డాక్ నాయక్



పారిశుధ్య విభాగం అధికారులు, ఉద్యోగులతో సమీక్షిస్తున్న డాక్ నాయక్

సికింద్రాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని, మరోవైపు గ్రేటర్ రాబడి వనరుల పట్ల శ్రద్ధ చూపాలని జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉపకమిషనర్ డాక్ నాయక్ ఆయా విభాగాల అధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తొలుత పారిశుధ్యం, పన్ను విభాగాల అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బేగంపేట్ సర్కిల్ ఉపకమినర్ సమ్మయ్య జూబ్లీహిల్స్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సర్కిల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా డాక్ నాయక్ బాధ్యతలు స్వీకరించిన సంగతి విదితమే. ముందుగా పారిశుధ్య నిర్వహణ విభాగం అధికారులు, ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. రోడ్లపై, రోడ్ల పక్కన చెత్తాచెదారాన్ని తొలగించాలని, చెట్ల కొమ్మలు, చెత్త రోడ్లపై ఉండకూడదన్నారు. ముఖ్యంగా ఈదురుగాలులు, వర్షం పడిన సందర్భాల్లో రోడ్లపై చెత్తాచెదారంతోపాటు చెట్ల కొమ్మలు పడతాయని, వాటిని త్వరగా తొలగించాలని చెప్పారు. విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యాన్ని, అలసత్వాన్ని ప్రదర్శించవద్దని హితవుపలికారు. శానిటేషన్ సూపర్వైజర్ డి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పన్ను విభాగం అధికారులు, సిబ్బందితో డాక్ నాయక్ సమావేశమయ్యారు. తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూలుపై సమీక్షించారు. మెరుగైన ఫలితాలు సాధించినందుకు అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ... ప్రస్తుతం ఎర్లీబర్డ్ స్కీమ్‌పై అందరూ దృష్టి సారించాలని, ఎర్లీ బర్డ్ కింద వీలైనంత ఎక్కువ మంది నుంచి ఆస్తిపన్ను వసూలు చేయాలని సూచించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.49 కోట్లు ఎర్లీ బర్డ్ కింద వసూలు చేసినందున, ఈ ఏడాది కూడా మరింత ఉత్సాహంగా పని చేసి, దీనిని అధిగమించాలని పిలుపునిచ్చారు. ఎర్లీబర్డ్ కింద ఆస్తిపన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ ఇస్తున్న అంశాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

అడ్వొకేట్‌పై కత్తితో దాడి

బౌద్ధనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పాతగొడవలు నేపథ్యంలో ఓ అడ్వొకేట్‌పై దగ్గర బంధువు కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నార్త్ లాల్‌గూడకు చెందిన అడ్వొకేట్ ముస్తాఫా అలియాస్ సోహెల్(28), మహ్మద్ బిలాల్ తౌసిఫ్ అలియాస్ బల్లు కజిన్స్. ఆస్తుల విషయంలో కొన్నిరోజులుగా వీరి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పద్మారావునగర్ గణేశ్ జువెలర్స్‌కు కూతవేటు దూరంలో ఆదివారం రాత్రి 11:45 ప్రాంతంలో ముస్తాఫా, బిలాల్ తౌసిఫ్ రోడ్డుపై గొడవపడ్డారు. ఆస్తులు, డబ్బులు పంపకం విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మహ్మద్ బిలాల్ తౌసిఫ్ తనవద్ద ఉన్న కత్తితో ముస్తాఫాపై దాడి చేసి పరారయ్యాడు. స్థానికులు వెంటనే 100కు డయల్ చేసి సమాచారం అందించారు. రక్తపు మడుగులో పడి ఉన్న ముస్తాఫాను పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ముస్తాఫా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని ప్రాణపాయం లేదని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి



సికింద్రాబాద్ సివిల్ కోర్టులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో న్యాయవాదులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాజశేకర్ రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీనియర్ న్యాయవాది మహ్మద్ ముస్తాబా అలీపై ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కత్తులతో దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా సోమవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోయేషన్ ప్రధాన కార్యదర్శి జనార్థన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సంయక్త కార్యదర్శి వినోద్ కుమార్, కార్యవర్గ సభ్యులు సంతోష్ కుమార్, మహిళా రిప్రజెంటివ్ న్యాయవాది మహేశ్వరి, కార్యవర్గ సభ్యులు సంతోష్ కుమార్, సమత, అనిత, సంజయ్ కుమార్ పావని, కోశాధికారి సురేష్, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శి మురళిధర్ యాదవ్ స్వామితో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



నిందితుడు శివ

బోయినపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి సికింద్రాబాద్ 6వ అదనపు సెషన్స్ ఎస్సీ, ఎస్టీ కోర్టుల న్యాయమూర్తి ఎస్.శ్రీవాణి సోమవారం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్టు బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ బోయినపల్లికి చెందిన కె.శివ అనే వ్యక్తి బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2917లో జరిగిన ఓ (స్వప్న) హత్య కేసులో నిందితుడని, అప్పటి ఇన్‌స్పెక్టర్ పీఆర్ రంగయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్టు తెలిపారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు ఎం.రవికిరణ్, సీహెచ్ ప్రశాంతరావు, రాజేష్ కేసులో సరైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.ఉపేందర్ బాధితుల పక్షాన కేసును వాదించి నిందితుడికి శిక్షపడేలా సాక్ష్యాలను న్యాయమూర్తి ముందు హాజరు పరిచినట్లు తెలిపారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి జీవిత కారాగార శిక్ష విధించారని, రూ.5వేలు జరిమానా విధించారని, జరిమానా చెల్లించకుంటే మరో 3 నెలలు శిక్ష విధించనున్నట్టు పోలీసులు తెలిపారు.

గాంధీ ఆస్పత్రిలో రోగి అదృశ్యం



రవీందర్ (ఫైల్)

బౌద్ధనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... అడ్డగుట్టకు చెందిన మేకల రవీందర్(38) తాగుడుకు అలవాటు పడ్డాడు. ఇటీవల మద్యం తాగకపోవడంతో మానసిక వ్యాధి భారిన పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రవీందర్‌ను గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. ఈనెల 5న రవీందర్ గాంధీ ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. సోమవారం భార్య రజిత తన భర్త కనిపించడం లేదని చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూనివర్సిటీల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌ను ఆపాలి : ఔటాసీ

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌ను వెంటనే ఆపాలని, దీనికి తాము వ్యతిరేకమని ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్(ఔటాసీ) డిమాండ్ చేసింది. ఔటాసీ నాయకులు వీసీ ఎం.కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఔటాసీ అధ్యక్షుడు డాక్టర్ పరశురాం మాట్లాడుతూ.. తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో 25 ఏండ్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో పెట్టిందన్నారు. ఇప్పుడు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోసం జీవో తీసుకురావడం తమ సేవలను విస్మరించడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసిన తరువాత కొత్తవారిని రిక్రూట్‌మెంట్ చేయాలి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.